క్లుప్తంగా

ఉమా శంకర్‌కి సత్కారం



పొన్నూరు: మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవలకు అరుదైన గౌరవం దక్కింది. శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సమితి పదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తిలోని కళావేదికపై నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తున్న మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు తిరుమలశెట్టి ఉమా శంకర్‌ను సేవా సమితి ప్రతినిధులు మెమెంటో అందించి, సత్కరించారు.

ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు చర్యలు

పొన్నూరు: వెల్లలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ వెంటనే వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపడుతున్నట్టు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అదనపు కో–ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రారంభానికి నోచుకోని ఆర్వో ప్లాంటుతో విద్యార్థుల తాగునీటికి అవస్థలు' అనే శీర్షికన ఈ నెల 5న సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత కార్యాలయ అధికారులు స్పందించారు. ఆర్వో ప్లాంటు వినియోగానికి టెక్నీషియన్‌ను పంపి విద్యార్థులకు తాగునీరు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. అప్పటివరకు విద్యార్థులకు వాటర్ క్యాన్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. అయితే వాటర్ క్యాన్ల ద్వారా నీటి సరఫరా వాస్తవం కాదని సమాచారం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: చెట్లు కొట్టే కార్యక్రమం వల్ల మంగళవారం పెదకాకాని మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంతని ఎలక్ట్రికల్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీహెచ్ ఖాన్ తెలిపారు. వెనిగండ్ల, పెదకాకాని గ్రామంలోని లూథర్‌గిరి కాలనీ, యువజననగర్, ముస్లింపాలెం, కొత్త నగరపాలెం, పాత నగరపాలెం, హెచ్‌టి కాలనీ ప్రాంతాలలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ



పొన్నూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ(పాఠశాల యాజమాన్య కమిటీ)ల ఏర్పాటుకు సర్వం సిద్ధమైంది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఎన్నుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎన్నికల నిర్వహణపై మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపై ఎంఈఓ శ్రీనివాసరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.హెచ్.ప్రసాద్, నోడల్ హెచ్ఎం వై.ఎస్.సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర బాధ్యతల స్వీకారం



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎస్ఐగా కె.నాగేంద్ర సోమవారం స్థానిక పోలీస్ స్టేషనులో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన సోమేశ్వరరావును సుమారు నలభై రోజుల కిందట సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెదకాకానిలో ఎస్ఐగా చేస్తున్న నాగేంద్రను ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వర్తిస్తానని ఎస్ఐ తెలిపారు.

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రం



పెదకాకాని: మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితమే స్వాతంత్య్రమని ఉపన్యాసకుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి చెప్పారు. పెదకాకాని మండలం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు భారత స్వాతంత్ర ఉద్యమంపై అవగాహన కలిగించారు. కార్యక్రమానికి అవర్ స్టేట్ అవర్ లీడర్ అండ్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి శాంతమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి, ఉపన్యాసకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు స్వాతంత్య్ర పోరాటంలోని వివిధ ఘట్టాలను వివరించారు.



ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫీజు బాక్స్

'గొయ్యో'మొర్రో



రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంత

పొన్నూరు: పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్లపై ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ముబారక్ నగర్ సెంటర్లోని ఫుట్ వేర్ షాపుల వద్దనున్న ఐరన్ మ్యాన్ హోల్ ప్రమాదకరంగా ఉంది. కొన్నిసార్లు ఇక్కడ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మ్యాన్ హోల్‌ను మూసి ఉంచాలని స్థానికులు కోరుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే ఇటికంపాడు రోడ్డు మసీదు వద్ద లోతైన గుంత పడింది. అధికారులు ఈ గుంతను పూడ్చకపోవడంతో స్థానికులు ప్రమాద సూచిక (ఎరుపు రంగు క్లాత్)ను పెట్టి జాగ్రత్త చర్యలు చేపట్టారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ఈ గొయ్యిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అ'తీగ'తీ లేదే



విద్యుత్ తీగలపై అల్లుకున్న చెట్లు

పొన్నూరు : ఇటికంపాడు మసీదు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మ్ ప్రమాదకరంగా ఉంది. చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో స్థానికులు భయపడుతున్నారు. పిల్లలకూ చేతికందే ఎత్తులో ఫ్యూజ్ బాక్సు ఉంది. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం సమీపంలో మెయిన్‌రోడ్డుపై విద్యుత్ తీగలకు చెట్లు, పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. విద్యు శాఖ ఈ తీగల గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చాలి



రోడ్లపై కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్, గుంతలు ఉన్నాయి. రాత్రివేళల్లో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ తీగలపై పిచ్చి మొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్పించి, మ్యాన్‌హోల్స్‌పై మూతలు వేయాలి. విద్యుత్ తీగలపై పిచ్చి మొక్కలను తొలగించాలి – షేక్. సాజిదా, పొన్నూరు

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రం

పెదకాకాని: మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితమే స్వాతంత్య్రమని ఉపన్యాసకుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి చెప్పారు. పెదకాకాని మండలం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు భారత స్వాతంత్ర ఉద్యమంపై అవగాహన కలిగించారు. కార్యక్రమానికి అవర్ స్టేట్ అవర్ లీడర్ అండ్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి శాంతమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి, ఉపన్యాసకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు స్వాతంత్య్ర పోరాటంలోని వివిధ ఘట్టాలను వివరించారు.



జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులతో సంగిరెడ్డి హనుమంతరెడ్డి, తదితరులు

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యదాయకం



నడింపాలెంలో తల్లిపాల ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, మహిళలు



తిక్కిరెడ్డిపాలెంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజరు భారతి

తల్లిపాల వారోత్సవాల్లో ఎంపీహెచ్ఈఓ చెల్లమ్మ

ప్రత్తిపాడు: అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని కాపాడుదామని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈఓ చెల్లమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నడింపాలెం సబ్‌సెంటరులో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, తల్లులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన చెల్లమ్మ అంతరాలను పూరిద్దాం.. తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించి కాపాడుకుందాం.. అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిపాలు తాగిన శిశువుల్లో యాంటీబాడిస్ వృద్ధి చెంది ఇన్‌ఫెక్షన్లు, నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు సోకవని చెప్పారు. బిడ్డను తల్లి తన ఒడిలో ఉంచుకుని పాలివ్వడం వలన తల్లి శరీరం నుంచి బిడ్డకు అవసరమైన వేడి అందుతుందన్నారు. ఇద్దరి మధ్య ఆప్యాయత, అనుబంధాలను పెంచేందుకూ తల్లిపాలు దోహదపడతాయన్నారు. పీహెచ్ఎన్ నిర్మల మాట్లాడుతూ తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి కూడా పలు ప్రయోజనాలున్నాయని, తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బుల నుంచి రక్షణ పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వివరించారు.

● ప్రత్తిపాడు సెక్టారులోని యనమదల డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గొట్టిపాడు సెక్టారులోని తిక్కిరెడ్డిపాలెం మెయిన్ అంగన్‌వాడీ సెంటరులో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సెక్టార్ల సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి.మాధవిలు మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం తప్పనిసరన్నారు. ఎంఎల్‌హెచ్‌పి కె.జయంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, ఎం.రోజారాణి, సుభాషిణి, ఏఎన్ఎం ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు రూరల్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నల్లపాడు పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డు రెడ్డిపాలెం నుంచి అక్రమంగా టాటా ఏస్ వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యంతోపాటు, డ్రైవర్‌ను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని నల్లపాడు పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఐటీసీ ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ మేనేజ్‌మెంట్‌లపై గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్‌నకు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగి నాగూర్ మీరా మృతి



షేక్ నాగూర్ మీరా (ఫైల్)

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేక్ నాగూర్ మీరా సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ ఎస్.హరికృష్ణ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, విభాగాధిపతులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం ప్రకటించారు. నాగూర్ మీరా చిన్న వయస్సులోనే మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి ఇప్పటికే మట్టి ఖర్చులు అందించామని, త్వరలో నగరపాలక సంస్థ నుంచి బెనిఫిట్స్ అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారిపై విచారణకు వినతి

లక్ష్మీపురం: గుంటూరు నగర పాలక సంస్థ వెహికిల్ షెడ్‌లో అధికారులు దందా నిర్వహిస్తున్నారని, వెహికల్స్ నిర్వహణ సక్రమంగా జరగటం లేదని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ఆరోపించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెన్న వెంకట కొండారెడ్డి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ హరికృష్ణను సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో వినతి పత్రం అందజేశారు.

13న అంతర్ కళాశాలల పోటీలు



బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాల లలిత కళా సమితి, స్టెప్–స్వశక్తి, యువజన సర్వీసుల శాఖ సంయుక్తంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీన అంతర్ కళాశాలల సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి. మల్లికార్జునప్రసాద్ తెలిపారు. సోమవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో పోటీలకు సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. కళాశాల స్థాయి విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, బృందనాట్యం తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. ఈనెల 10వ తేదీ లోపు తమ పేర్లను 98481 10174, 96406 80307 ఫోన్ నంబర్లలో నమోదు చేసుకోవాలని కన్వీనర్ డాక్టర్ ఎ.బాలశౌరి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ దుర్గా ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కాశీదాస్, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్, స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి పీవీ రాము తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు



విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న నాగభూషణం, సీతారామయ్య, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'అమ్మ పేరుతో ఒక్క మొక్క' కార్యక్రమాన్ని అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు సోమవారం సంపత్‌నగర్‌లోని శ్రీరామనామ క్షేత్రంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోపాటు అందరికీ ఉపయోగపడేలా మామిడి, తులసి, మారేడు, దానిమ్మ వంటి మొక్కలను నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. సీతారామయ్య, ఫార్మకాగ్నసీ విభాగాధిపతి డాక్టర్ ఎం. రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. మొక్కలు నాటడంలో సహకారాన్ని అందించిన శ్రీరామనామక్షేత్రం నిర్వాహకులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు ధన్యవాదాలు తెలిపారు.

ప్రగతి నగర్ అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కోట మాల్యాద్రి

లక్ష్మీపురం : ప్రగతి నగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి అందరూ కృషి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పేర్కొన్నారు. ప్రగతి నగర్ 6–7 వార్డుల సీపీఐ శాఖల సమావేశం నూతలపాటి చిన్న అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ.. నగరంలోని ఇల్లు లేని నిరుపేదల కోసం సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి విజయం సాధించినట్లు తెలిపారు. ప్రస్తుత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌లు ప్రగతి నగర్ అభివృద్ధికి సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆరో బ్లాక్ కార్యదర్శి ఏసు, ఐదో బ్లాక్ కార్యదర్శి అప్పమ్మ, నాయకులు ఎలీషా, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడి బాట పట్టించారు



ఎస్టీ కాలనీలో చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: విద్యాశాఖ అధికారులు మొద్దునిద్ర వీడారు. బడి బయట తిరుగుతున్న బడి ఈడు బాలలను బడి బాట పట్టించారు. ప్రత్తిపాడులోని ఎస్టీ కాలనీ చిన్నారులు బడిమెట్లు ఎక్కడం లేదని, యాచనబాట పడుతూ జీవన పోరాటం చేస్తున్నారని, సాక్షాత్ జిల్లా కలెక్టర్ చెప్పినా అధికారులు స్పందించడం లేదంటూ సోమవారం 'సాక్షి'లో 'విద్యాశాఖ మొద్దు నిద్ర.. బంగారు బాల్యం ఛిద్రం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి శైలజ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు ఎంఈఓ సీహెచ్ రమాదేవి, ఎంఈఓ–2 జి.లీలారాణిలు, ఎల్ఈ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులతో కలిసి స్థానిక ఎస్టీ కాలనీలో పర్యటించారు. బడి ఈడు చిన్నారులను బడికి పంపకుండా యాచనకు పంపుతున్న వారి తల్లిదండ్రులతో పాటు పశువుల కాపరిగా మారిన బాలుడి తండ్రితో మాట్లాడారు. బడిఈడు చిన్నారులంతా కచ్చితంగా బడిలోనే ఉండాలన్నారు. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులను వెంటబెట్టుకుని బడికి తీసుకువెళ్లారు. ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న మరో ఇద్దరు విద్యార్థులను భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతిలో చేర్పించారు. మొత్తంమీద కాలనీలో ఉన్న బడి ఈడు పిల్లలను ఎల్ఈ పాఠశాలకు తీసుకువెళ్లి పాఠ్యాంశాలు బోధించారు.

తీర్మానం లేకుండా డబ్బులు డ్రా చేశారు

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన డ్వాక్రా మహిళలు



మీ కోసంలో తహసీల్దార్ కె.రవిబాబుకు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి స్పందన లభించింది. పలు గ్రామాల నుంచి ప్రజలు రకరకాల సమస్యలపై తహసీల్దార్ కె.రవిబాబును కలిసి తమ గోడును వినిపించారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిర్దేశిత గడువులోపు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించడం జరుగుతుందని అర్జీదారులకు భరోసానిచ్చారు. ఇటీవల జరిగిన భూముల రీ సర్వే సమయంలో తమ భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలతో పాటు చిన్నచిన్న సమస్యలు తలెత్తినట్లు నలుగురు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఇతరత్రా సమస్యలకు సంబంధించి మరో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

– ప్రత్తిపాడుకు చెందిన పిరానే పీర్ డ్వాక్రా గ్రూపు మహిళలు మీ కోసంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా రూ. 86,010 తమకు పొదుపు ఖాతా నుంచి సీసీ లోన్‌కు జమ చేశారని, అదేవిధంగా తాము తీర్మానం చెయ్యకుండా రూ. 3,36,000 అప్పు పుస్తకం నుంచి డ్రా అయ్యాయని, దాని వలన తామంతా అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తుందని వాపోయారు. తమ తీర్మానం పుస్తకాల్లో గ్రూపు సభ్యుల సంతకాలు కూడా ఫోర్జరీ చేసి ఉన్నాయని తహసీల్దార్‌కు వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ వెంటనే వీరిపై క్రిమినల్ కేసు పెట్టమని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. తాను కూడా ఎస్ఐతో మాట్లాడుతానని తహసీల్దార్ బాధితులకు చెప్పారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

హెచ్ఎంల సమావేశంలో ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్



హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ దుర్గాప్రసాద్, పక్కన ఎంఈఓలు

ప్రత్తిపాడు: విద్యార్థులపైనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఆధారపడి ఉందని ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ సీహెచ్ రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతుండటం సరికాదన్నారు. మండలం నుంచి ఉపాధ్యాయులు నెలకు సుమారు రూ.50లక్షల మేర జీతం తీసుకుంటున్నారని, ఉపాధ్యాయులు మనుగడ సాధించాలంటే విద్యార్థులుండాలని, విద్యార్థులుంటేనే స్కూల్ ఉంటుందని, పాఠశాల ఉంటేనే ఉపాధ్యాయులు ఉంటారన్న విషయాన్ని గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల ఇంటికి ఉపాధ్యాయులు వెళ్లి పిల్లలు ఎందుకు పాఠశాలకు రావడం లేదో తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఎంఈఓలు రమాదేవి, లీలారాణిలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదుల్లో వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఫోన్లు వినియోగించడం, మెజేసింగ్ యాప్‌ల్లో వ్యక్తిగత చాట్‌లు చేయడం వంటివి చేస్తే ఉపేక్షించబోమన్నారు.

ప్రత్తిపాడు హైస్కూల్ హెచ్ఎంకు మెమో..

ప్రత్తిపాడు హైస్కూల్ హెచ్ఎం హరిదాసు శ్రీనివాసరావుకు మెమో జారీ చేయాలని ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్ ఎంఈఓను ఆదేశించారు. హెచ్ఎంల సమావేశం జరుగుతుందని ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికీ హెచ్ఎం హాజరు కాకుండా ఆయన స్థానంలో ఇతర ఉపాధ్యాయుడిని సమావేశానికి పంపారు. ప్రత్తిపాడు హైస్కూల్లో ఇటీవలే కలెక్టర్ పర్యటించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోవడానికి గల కారణాలు అడిగి, వెంటనే స్పెషల్ డ్రైవ్ పెట్టాలని హెచ్ఎంతో పాటు పలు శాఖల అధికారులను ఆదేశించారు. హెచ్ఎం సమావేశానికి డుమ్మా కొట్టడంతో ఈ విషయమై చర్చించేందుకు ఎంపీడీఓకు అవకాశం లేకుండా పోయింది. దీంతో సమావేశానికి ఎందుకు గైర్హాజరయ్యారో చెప్పాలంటూ హెచ్ఎంకు మెమో ఇవ్వాలని ఎంపీడీఓ ఆదేశించారు.

కౌలు కార్డుల జారీలో తప్పులు తలెత్తరాదు



కౌలుకార్డుల జారీలో సమస్యలను తహసీల్దార్‌కు వివరిస్తున్న యనమదల వీఆర్ఓ ఆదినారాయణ

ప్రత్తిపాడు: కౌలు కార్డుల జారీలో ఎలాంటి తప్పులు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కె.రవిబాబు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, వీఏఏలతో తహసీల్దార్ కౌలు రైతు గుర్తింపు కార్డులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో సుమారు 1600 కార్డులు లక్ష్యం ఉందని, ఇప్పటివరకు 800 కార్డులు మాత్రమే మంజూరు చేశామన్నారు. లక్ష్యాన్ని ఛేదించాలంటే వీఆర్వోలు, వీఏఏలు గ్రామాల్లో భూ యజమానులకు, కౌలు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. యనమదల, వంగిపురం, పాతమల్లాయపాలెం, గొట్టిపాడు, గనికపూడి గ్రామాల్లో కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. కేవలం తొమ్మిది నెలల కాల పరిమితితో ఇచ్చే కార్డులపై భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్న విషయాన్ని వివరించాలన్నారు. అదేవిధంగా కార్డులు తీసుకోవడం వలన కౌలు రైతులకు కలిగే ప్రయోజనాలను తెలియజెప్పాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క కౌలుదారుడు కూడా కార్డు తీసుకోకుండా ఉండకూడదని చెప్పారు. వ్యవసాయాధికారి అరుణకుమారి మాట్లాడుతూ కౌలు కార్డులను తీసుకోవడం వలన రాయితీపై విత్తనాలు, సాగు చేసిన పంటపై రుణాలు, యంత్రపరికరాలు, పంట నష్టపరిహారం వంటి ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

కొందరు ఒప్పుకోవడం లేదు..

కౌలు రైతుల కార్డుల మంజూరుపై భూ యజమానులతో ఏమైనా సమస్యలున్నాయా అని తహసీల్దార్ వీఆర్వో, వీఏఏలను ప్రశ్నించారు. దీంతో యనమదల వీఆర్వో ఆదినారాయణ మాట్లాడుతూ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మల్లంపాటి శేషగిరిరావు తన పొలంను వేరే రైతులకు కౌలుకు ఇచ్చాడని, వారికి కౌలు కార్డులు ఇచ్చేందుకు ఒప్పుకోవడం లేదని వివరించారు. అదేవిధంగా పాతమల్లాయపాలెంలో కూడా చాలా మంది భూ యజమానులు కౌలుకార్డులిచ్చేందుకు ముందుకు రావడం లేదని వీఆర్వో రాంబాబు తెలిపారు. కార్డుల జారీకి అంగీకరించని భూయజమానులు ఎక్కువగా ఉన్న గ్రామాలకు తానే స్వయంగా వచ్చి అవగాహన కల్పిస్తానని తహసీల్దార్ చెప్పారు. సమావేశంలో సూపరింటెండెంట్ ప్రశాంతి, ఆర్ఐ సాహితి, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.